మంగళవారం 07-01-2025

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## దేశంలో రాజకీయాలు దిగజారిపోతున్నాయి

- ఇంటిపేరుతో భాజపా నేత వ్యాఖ్యలు
- భావోద్వేగానికి గురైనా ఢిల్లీ సీఎం ఆతిశీ



2 లో

## వైరస్‌పై ఆందోళన అవసరం లేదు

సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు

కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం

2 లో



## ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో కీలక అంశాలు

బహిర్గతం చేసిన తెలంగాణ ప్రభుత్వం



2 లో

# చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం

## రూ.413 కోట్లతో నిర్మించిన ప్రభుత్వం

ముందడుగు హైదరాబాద్

తెలంగాణలోని హైదరాబాద్ చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ హాజరయ్యారు. గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది.

కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్లకు పైగా పరిధి విస్తరించిందని చెప్పారు. జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని పేర్కొన్నారు.



## భద్రతాబలగాల వాహనం పేల్చివేత

- మందుపాతరతో పేల్చివేసిన మావోయిస్టులు
- ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతి
- తిరిగి వెళ్తుండగా కాపు కాసి ఐఈడీని పేల్చారు



2 లో

## తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ

- రాష్ట్రంలో ఓటర్లు 3.35 కోట్లు..జాబితా
- విడుదల చేసిన రాష్ట్రఎన్నికల సంఘం



3 లో

ముందడుగు
మంగళవారం
07-01-2025
హైదరాబాద్

## దేశంలో రాజకీయాలు
# దిగజారిపోతున్నాయి

ముందడుగు ఢిల్లీ

తన ఇంటి పేరును లక్ష్యంగా చేసుకొని బిజెపి మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ చేసిన వ్యాఖ్యలకు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా అంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. సీఎం ఆతిశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా.. ప్రస్తుతం మరో పేరును వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు" అంటూ బిజెపి నేత రమేశ్ ఆరోపించారు.

ఈ వ్యాఖ్యలపై విలేకరుల సమావేశంలో స్పందించిన ఆతిశీ మండిపడ్డారు. "నా తండ్రి ఒక ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన ఒకరి సహాయం లేనిదే నడవలేని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంతకు దిగజారుతారా..?ఒక వృద్ధుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదు. దేశంలో రాజకీయాలు దిగజారిపోతున్నాయంటే నమ్మలేకపోతున్నాను" అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

## భద్రతా బలగాల వాహనం
# పేల్చివేత..

ముందడుగు ఛత్తీస్‌గఢ్



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కుత్రు అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు మందుపాతర పెట్టి పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. ఐఈడీ పేలిన సమయంలో వ్యాన్‌లో 15 మంది జవాన్లు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

భద్రతా బలగాలు ప్రయాణిస్తున్న వాహనం కుత్రు అటవీప్రాంతంలోని ఓ మార్గం వద్దకు రాగానే.. మావోయిస్టులు మందుపాతరను పేల్చారు. ఈ క్రమంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. పోలీసువాహనం తుక్కుతుక్కైంది. దంతెవాడ, నారాయణ్‌పూర్, బీజాపూర్ సరిహద్దుల్లో పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి.. తిరిగి వెళ్తుండగా దారిలో కాపు కాసిన మావోయిస్టులు ఐఈడీని పేల్చారు.గత కొన్నాళ్లుగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతను భద్రతా బలగాలు ముమ్మరం చేశాయి. శనివారం అర్ధరాత్రి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందగా.. ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో
# కీలక అంశాలు

ముందడుగు తెలంగాణ




తెలంగాణలో జరిగిన ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో కీలక అంశాలను తెలంగాణ ప్రభుత్వం బయటపెట్టింది. రేస్ నిర్వహించిన గ్రీన్‌కో సంస్థ ద్వారా భారాసకు రూ.కోట్లలో లబ్ధి చేకూరినట్లు వెల్లడించింది. ఎన్నికల బాండ్ల ద్వారా ఆ పార్టీకి రూ.41 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం తెలిపింది. గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు 26 సార్లు బాండ్లు కొన్నట్లు వెల్లడించింది. 2022 ఏప్రిల్ 8-అక్టోబర్ 10 మధ్య కొన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.ఈ కేసులో ఏసీబీ నోటీసులు జారీ చేయడంతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేడు విచారణ కోసం వచ్చిన విషయం తెలిసిందే. తనతో పాటు న్యాయవాదిని లోపలికి పోలీసులు అనుమతించకపోవడంతో కేటీఆర్ అక్కడి నుంచి వెనుదిరిగారు. మరోవైపు ఆయనకు మళ్లీ నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

## వైరస్‌పై ఆందోళన
# అవసరం లేదు

ముందడుగు జాతీయం

భారత్‌తో సహ ప్రపంచవ్యాప్తంగా హెచ్ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. మిగతా శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. దేశంలో ఇన్‌ఫ్లుయెంజా మాదిరి వ్యాధులు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు అసాధారణ రీతిలో ఏమీ లేవని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే హెచ్ఎంపీవీ ఉంటుంది. సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది" అని కేంద్ర ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ పేర్కొన్నారు. సీజనల్ శ్వాసకోశ సంబంధింత కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో భారత్‌లోని ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శీతాకాలంలో అవసరమైన జాగ్రత్తలు వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముందడుగు
మంగళవారం
07-01-2025
హైదరాబాద్

## జర్నలిస్టును
# అత్యంత దారుణంగా చంపేశారు

### గుండెను చీల్చి బయటకు తీశారు
### అతడి కాలేయం నాలుగు ముక్కలైనట్లు గుర్తింపు
### శవ పరీక్షల్లో వెల్లడైన పలు విషయాలు




ముందడుగు జాతీయం

హత్యకు గురైన జర్నలిస్టు ముఖేశ్ కేసులో ఒళ్లు గగుర్పొడిచే అంశాలు వెలుగుచూస్తున్నాయి. హంతకులు అతడిని దారుణంగా కొట్టి.. గుండెను చీల్చి బయటకు తీసినట్లు శవ పరీక్షల్లో తేలింది. ఇప్పటికే నిందితుడిని ఆదివారం హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ముఖేశ్ మృతదేహానికి డాక్టర్లు శవ పరీక్షను ముగించారు. అతడి కాలేయం నాలుగు ముక్కలైనట్లు గుర్తించారు. అంతేకాదు.. అతడి పక్కటెముకలు ఐదు చోట్ల, తలపై 15 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. అతడి గుండెను చీల్చినట్లు తేలింది. తమ 12 ఏళ్ల కెరీర్‌లో ఇంత భయానక హత్యను ఎన్నడూ చూడలేదని డాక్టర్లు వెల్లడించారు. ఇద్దరు కంటే ఎక్కువమందే ఈ హత్యలో పాల్గొన్నట్లు అనుమానం వ్యక్తంచేశారు.

బస్తర్‌కు చెందిన ముకేశ్.. అదే ప్రాంతంలోని గంగలూరు నుంచి హిరోలి వరకు రూ. 120 కోట్లతో చేపట్టిన రోడ్డు ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కథనం వెలువరించాడు. తొలుత రూ. 50 కోట్ల టెండర్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్టు.. పూర్తిస్థాయి అభివృద్ధి జరగకపోయినప్పటికీ రూ. 120 కోట్లకు చేరుకుందని వెల్లడించాడు. అనంతరం అతడు కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ సురేశ్ చంద్రకర్ ఇంటి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్‌లో శవమై కనిపించాడు.

## తెలంగాణలో
# ఓటర్ల జాబితా సవరణ

ముందడుగు తెలంగాణ

తెలంగాణలో సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తంగా 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,66,41,489 మంది పురుషులు, 1,68,67,735 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల వయసున్న ఓటర్లు - 5,45,026, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ ఓటర్లు - 2,22,091, ఎన్ఆర్ఐ ఓటర్లు - 3,591, ప్రత్యేక ప్రతిభావంతులు ఓటర్లు - 5,26,993,శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది, అత్యల్పంగా భద్రాచలంలో 1,54,134 ఓటర్లు ఉన్నారు

## అమెరికాలో భీకర
# మంచు తుఫాన్

### 6కోట్ల మంది అమెరికన్లపై తీవ్ర ప్రభావం
### ఏడు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటన



ముందడుగు జాతీయం

అగ్రరాజ్యం అమెరికాపై మంచు తుఫాన్ విరుచుకు పడింది. వింటర్ స్టార్మ్ సుమారు 6 కోట్ల మంది అమెరికన్లపై తీవ్ర ప్రభావం చూపనున్నది. అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మొత్తం ఏడు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. కాన్సాస్ సిటీపై పెను ప్రభావం పడింది. మిస్సోరీ, కెంటకీ, వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, అర్కాన్సాస్, న్యూజెర్సీ రాష్ట్రాల్లోనూ మంచు తుఫాన్ బీభత్సం సృష్టిస్తున్నది. మంచు తుఫాన్‌కు బ్లెయిర్‌గా నామకరణం చేశారు. సుమారు 30 రాష్ట్రాల్లో ఆ తుఫాన్ ప్రభావం ఉన్నది. బ్లెయిర్ మంచు తుఫాన్ వల్ల.. అధిక స్థాయిలో మంచు, ఐస్, సబ్ జీరో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి.పోలార్ వొర్టెక్స్ వల్ల విపరీత వాతావరణ పరిస్థితులు ఏర్పడినట్లు వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వీస్తున్న చల్లటి గాలి.. సెంట్రల్ అమెరికాను ప్రస్తుతం వణికిస్తున్నది. ఇప్పటికే వేల సంఖ్యలో విమానాలు ఆలస్యం అవుతున్నాయి. కొన్నింటిని రద్దు కూడా చేశారు. తుఫాన్ వల్ల అనేక ప్రాంతాల్లో రోడ్లు జామయ్యాయి. స్కూళ్లను మూసివేశారు. సోమవారం తర్వాత పరిస్థితులు మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు వెదర్ శాఖ తెలిపింది.

ముందడుగు
మంగళవారం 07-01-2025 హైదరాబాద్

## జ్ఞాపకాలెన్నో..

గడిచిన గతంలో
తడిచిన జ్ఞాపకాలెన్నో
ముగిసిన కథలో
మునిగిన వ్యథలెన్నో
జత కలసిన ప్రకృతిలో
నే నేర్చుకున్న పాఠాలెన్నో
ఆగ్రహిస్తే ఆశ్చర్యకార్యాలెన్నో
ప్రకోపిస్తే ప్రళయాలెన్నో
మదిని తేలిక పరిచే అసత్యాలెన్నో
మనిషిని రాయిని చేసే కఠిన
సత్యాలెన్నో
మరువని గాయాలెన్నో
విడువని తలపులెన్నో
తొక్కిసలాటలో
చితికిపోతున్న ఆలోచనలెన్నో
ముక్కలు చేస్తున్న మౌన రోధనలెన్నో
వెక్కి వెక్కి ఏడ్వలేని వేదనలెన్నో
అన్నీ జ్ఞాపకాలై కుళ్ళబోడిచిన
రాత్రులెన్నో...

వాసి జ్యోత్స్న
9866843005



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో

# రాజీనామా!

**90 రోజుల్లో కొత్త నాయకత్వం**



ముందడుగు జాతీయం

కెనడాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. లిబరల్ పార్టీ నాయకత్వానికి, ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించారు. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న తర్వాత బాధ్యతల నుంచి వైదొలుగుతానని చెప్పారు. ట్రూడో వైదొలగాలంటూ సొంత పార్టీ నేతల నుంచి కొంతకాలంగా డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు.

"పార్టీ నాయకత్వానికి, ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయనున్న విషయాన్ని పార్టీకి, గవర్నర్‌కు తెలియజేశాను. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్న వెంటనే రాజీనామా చేస్తా. ఈ ప్రక్రియ కొనసాగించేందుకు మార్చి 24వరకు పార్లమెంటును ప్రొరోగ్ చేస్తున్నా" అని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. అయితే, కెనడా చట్టం ప్రకారం.. అధికార పార్టీ నేత రాజీనామా చేసిన పక్షంలో 90 రోజుల్లో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుంది.

కేటీఆర్‌కు మరోసారి

# ఏసీబీ నోటీసులు

**ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని ఆదేశాలు**



ముందడుగు తెలంగాణ

తెలంగాణ ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 9న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గచ్చిబౌలి ఓరియన్ విల్లాకు వెళ్లిన ఏసీబీ అధికారులు.. ఈ మేరకు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు.

ఈ కేసులో విచారణకు హాజరుకావాలంటూ ఏసీబీ అధికారులు ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌కు నోటీసులిచ్చారు. విచారణ నిమిత్తం ఇవాళ ఉదయం కేటీఆర్.. ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. అక్కడ తన న్యాయవాదిని పోలీసులు అడ్డుకోవడంపై కేటీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తనతో పాటు న్యాయవాది వస్తే నష్టమేంటని ప్రశ్నించారు. దీంతో రోడ్డుపైనే తన స్పందనను రాతపూర్వకంగా ఏసీబీ అధికారులకు అందజేశారు. హైకోర్టు తీర్పు తర్వాత చట్టప్రకారం ముందుకెళ్లాలని అందులో పేర్కొన్నారు. విచారణకు హాజరుకాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు మరోసారి నోటీసులిచ్చారు. ఈ సారి న్యాయవాది సమక్షంలో ప్రశ్నిస్తారా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

# నిరుపేద మహిళలకు అండగా "ఎక్స్ట్రా మైల్"

**నిరుపేద మహిళలకు**

**స్వయం ఉపాధి సహకారం**

ముందడుగు హైదరాబాద్

హైదరాబాద్ కి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ "ఎక్స్ట్రా మైల్". నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి అందించాలని లక్ష్యంతో హైదరాబాదులోని మల్లాపూర్ పారిశ్రామిక వాడ సూర్య నగర్ కాలనీలో నిరుపేద మహిళలకు "సబల" పేరుతో టైలరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి వాళ్లకి ఉచితంగా టైలరింగ్ నేర్పించి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తూ వారి జీవనోపాధికి బాసటగా నిలుస్తున్నారు. సోమవారం 6వ బ్యాచ్ లో శిక్షణ పొందిన 36 మంది మహిళలు ఈ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొంది ఉచితంగా కుట్టు మిషన్ లను తీసుకోవడం జరిగింది. ఎక్స్ట్రా మైల్ ఫౌండర్ జయ నాగమోహన్ మాట్లాడుతూ అమెరికాలోని హెూప్ ఫర్ హ్యూమానిటీ ట్రస్ట్ వారి మరియు స్ఫూర్తి ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో, జనహిత ట్రస్ట్ వారి చేయూతతో సబల ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికి కుట్టు మిషన్ అందజేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెూప్ ఫర్ హ్యూమానిటీ అమెరికా ప్రతినిధి కోటేశ్వరరావు జన ప్రగతి సేవా ట్రస్ట్ శరత్ చంద్ర జెడి ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ మురళీమోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

